మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 187 | మంగళవారం 06 - 01 - 2026 | పేజీలు: 8 | వెల: 4


## సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ క్లినిక్ లు



3లో..

## మాతృభాషను విస్మరిస్తే
# మన ఉనికిని కోల్పోయినట్లే

- రాజమండ్రిలో తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు ప్రకటన
- మూడో ప్రపంచ తెలుగు మహాసభల ముగింపు వేడుకల్లో సీఎం



మన గళం, గుంటూరు : మాతృభాష మన మూలాలకు, మన సంస్కృతికి ప్రతీక అని, ప్రపంచంతో పోటీ పడేందుకు ఆంగ్ల భాష అవసరమెనప్పటికీ మాతృభాషను విస్మరిస్తే మన ఉనికినే కోల్పోయినట్లవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాజమండ్రిలో తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన కీలక ప్రకటన చేశారు. గుంటూరులోని శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక నగరంలో మూడు రోజులుగా నిర్వహించిన మూడో ప్రపంచ తెలుగు మహాసభల ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న చంద్రబాబు ప్రసంగించారు. "సంక్రాంతికి ముందే వచ్చిన పండుగ ఈ ప్రపంచ తెలుగు మహాసభలు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు నందమూరి తారక రామారావు పేరును ఈ వేదికకు పెట్టడం చాలా సంతోషంగా ఉంది" అని పేర్కొన్నారు. తెలుగు భాషకు అత్యంత ఘనమైన చరిత్ర ఉందని, దేశంలో వందలాది భాషలు ఉన్నప్పటికీ ప్రాచీన హోదా పొందిన ఆరు భాషల్లో తెలుగు ఒకటని సీఎం గుర్తుచేశారు. హిందీ, బెంగాలీ, మరాఠీ తర్వాత దేశంలో అత్యధికంగా మాట్లాడే నాలుగో భాష తెలుగు అని, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 10 కోట్ల మంది తెలుగు మాట్లాడుతున్నారని వివరిం చారు. దాదాపు 40 దేశాల నుంచి ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరుకావడం



తెలుగు భాష గొప్పతనానికి నిదర్శనమని అన్నారు. ఆధునిక తెలుగు భాషకు పితామహుడైన గిడుగు వెంకట రామ్మూర్తి సేవలను తెలుగు జాతి ఎప్పటికీ మరువ దని చంద్రబాబు కొనియాడారు. "నేను తెలుగు వాణ్ణి.. నాది తెలుగుదేశం" అని గర్వంగా ప్రకటిం చిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్ అని ప్రశంసిం చారు. 1985లోనే ఎన్టీఆర్ ముందుచూపుతో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని హైదరా

2 లో..




## స్వదేశీ నౌకా సామర్థ్యంలో
# కీలక ముందడుగు

- ఐసీజీఎస్ 'సముద్ర ప్రతాప్'ను ప్రారంభించిన రక్షణ మంత్రి
- కాలుష్య నియంత్రణలో భారత్‌కు కొత్త శక్తి




మన గళం, గోవా : భారత్ నౌకా నిర్మాణం, సముద్ర భద్రతలో స్వావలంబన దిశగా మరో కీలక ముందడుగు వేసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గోవాలో భారత తీర రక్షక దళానికి చెందిన కాలుష్య నియంత్రణ నౌక ఇండియన్ కోస్ట్ గార్డ్కు చెందిన 'సముద్ర ప్రతాప్'ను అధికారికంగా ప్రారంభించారు. గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ నిర్మించిన రెండు కాలుష్య నియంత్రణ నౌకలలో ఇది మొదటిది. గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ తయారు చేసిన ఈ నౌక 60 శాతం కంటే ఎక్కువ స్వదేశీ భాగాలతో నిర్మించబడడం విశేషం. ఇది భారత్‌లో పూర్తిగా దేశీయంగా రూపకల్పన చేసిన తొలి కాలుష్య నియంత్రణ నౌకగా చరిత్ర సృష్టించింది. 'సముద్ర ప్రతాప్' ప్రస్తుతం భారత తీర

2 లో..


## పాయకరావుపేట విద్యార్థులకు
# సైకిళ్ల పంపిణీ

- విద్యకు ప్రాధాన్యం పెంచుతున్న కూటమి ప్రభుత్వం
- సీఎస్ఆర్ నిధులతో 10వ తరగతి విద్యార్థులకు 2,600 సైకిళ్లు
- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి



మన గళం, నక్కపల్లి : రాష్ట్రంలో విద్యకు ప్రాధాన్యం పెంచడంతో పాటు విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోం దని పేర్కొన్నారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ల నాయకత్వంలో విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ఈ క్రమంలో పాయకరావుపేట నియోజకవర్గంలోని 10వ తరగతి విద్యార్థు లకు సీఎస్ఆర్ నిధులతో మొత్తం 2,600 సైకిళ్లను పంపిణీ చేశారు. నక్కపల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సైకిళ్లు

2 లో..



## చిన్నరాముడికి ఆంధ్ర సరస్వత
# పరిషత్ అవార్డు

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : తెలుగు భాష, సాహిత్య పరిరక్షణకు చేసిన సేవలకు గుర్తింపుగా కర్నూలు నగరపాలక సంస్థ మేనేజర్ యన్. చిన్నరాముడుకు ఆంధ్ర సరస్వత పరిషత్ అవార్డు లభించింది. ఆంధ్ర సరస్వత పరిషత్, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు2026లో భాగంగా ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి మేనేజర్ చిన్నరాముడికి అవార్డును ప్రదానం చేశారు. తెలుగు భాష అభివృద్ధి, సాంస్కృతిక విలువల పరిరక్షణ, సాహిత్య ప్రోత్సాహానికి నిరంతరం కృషి

2 లో..

# డేరా అధిపతికి మళ్లీ పెరోల్



- నలభై రోజులు జైలు నుంచి విడుదల

సిర్సా / రోహ్‌తక్, మన గళం, డేరా సచ్చా సౌదా అధిపతికి హర్యానా ప్రభుత్వం నలభై రోజుల పెరోల్ మంజూరు చేసింది. దీంతో సోమవారం ఆయన రోహ్‌తక్‌లోని సునారియా జైలు నుంచి విడుదలయ్యారు. తన ఇద్దరు భక్తురాళ్లపై అత్యాచారం చేసిన కేసులో ఇరవై సంవత్సరాల జైలు శిక్ష అనుభవిస్తున్న ఆయన, రెండు వేల పదిహేడు సంవత్సరంలో దోషిగా తేలినప్పటి నుంచి పెరోల్‌పై బయటకు రావడం ఇది పదిహేనో సారి కావడం గమనార్హం. పెరోల్ కాలంలో ఆయన హర్యానా రాష్ట్రంలోని సిర్సాలో ఉన్న డేరా ప్రధాన కార్యాలయంలోనే నివసిస్తారని డేరా ప్రతినిధి మరియు న్యాయవాది జితేందర్ ఖురానా తెలిపారు. కోర్టు విధించిన నిబంధనలకు లోబడి అక్కడే ఉంటారని, ప్రజా సమావేశాలు నిర్వహించరాదని, రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉండాలనే ఆంక్షలు ఉన్నాయని స్పష్టం చేశారు. అత్యాచార కేసులతో పాటు,

2 లో..

# నాలెడ్జ్ బేస్డ్ సమాజ నిర్మాణంలో విశ్వవిద్యాలయాలే కేంద్ర బిందువు

- వీసీలు పరిపాలకులే కాదు సంస్కరణల అంబాసిడర్లు
- పరిశ్రమలతో అనుసంధానం, సిలబస్ మార్పులు అవసరం
- స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీస్ వీసీల సమావేశంలో మంత్రి నారా లోకేష్




మన గళం, విజయవాడ : విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీస్ వైస్ చాన్సలర్స్ కాన్ఫరెన్స్‌లో ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహించారు. నాలెడ్జ్ బేస్డ్ సొసైటీని నిర్మించడంలో విశ్వవిద్యాలయాలదే కీలక పాత్ర అని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. వైస్ చాన్సలర్లు కేవలం పరిపాలనా అధిపతులు మాత్రమే కాదని, సమాజంలో విద్యా సంస్కరణలకు నాయకత్వం వహించే అంబాసిడర్లుగా వ్యవహరించాలన్నారు. యువతకు వాస్తవంగా

2 లో..

## కోనసీమలో ఓఎన్జీసీ
# గ్యాస్ లీకేజీ కలకలం

- గ్యాస్ లీకేజీతో భారీ మంటలు
- కొబ్బరి తోటలకు తీవ్ర నష్టం
- సీఎం చంద్రబాబు ఆదేశాలతో సహాయక చర్యలు



మన గళం, మలికిపురం : కోనసీమ జిల్లాలో తీవ్ర ఆందోళన నెలకొంది. మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలో ఉన్న ఆయిల్ అండ్ నేచరల్

2 లో..

# స్వదేశీ నౌకా సామర్థ్యంలో కీలక ముందడుగు



రక్షక దళంలోనే అతిపెద్ద నౌకగా నిలిచింది. సముద్రంలో చమురు లీకులు, పారిశ్రామిక కాలుష్య ఘటనల సమయంలో తక్షణ స్పందన కోసం ఈ నౌక కీలకంగా పనిచేయనుంది. పర్యావరణ పరిరక్షణతో పాటు సముద్ర భద్రతను మరింత బలోపేతం చేయడమే దీని లక్ష్యం. ఈ నౌక ప్రారంభం ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి నౌకా రంగంలో మరింత బలం చేకూరిందని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. స్వదేశీ సాంకేతికతతో తయారైన ఈ తరహా నౌకలు భవిష్యత్తులో భారత సముద్ర శక్తిని మరింత విస్తరించనున్నాయని పేర్కొన్నారు.

# డేరా అధిపతికి మళ్లీ పెరోల్

పదహారు సంవత్సరాల క్రితం జరిగిన ఒక జర్నలిస్టు హత్య కేసులోనూ ఆయనను రెండు వేల పన్నెండు తొమ్మిదిలో కోర్టు దోషిగా తేల్చింది. గతంలో కూడా పలు మార్లు ఆయనకు పెరోల్ లభించింది. రెండు వేల ఇరవై ఐదు ఏప్రిల్‌లో ఇరవై ఒక రోజు, అదే సంవత్సరం ఆగస్టులో నలభై రోజుల పాటు జైలు నుంచి బయటకు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా, ఆయనకు మళ్లీ పెరోల్ ఇవ్వడాన్ని సిక్కు సంస్థలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. బాధితులకు న్యాయం జరగాల్సిన సమయంలో ఇలాంటి వెసులుబాట్లు ఇవ్వడం సరికాదని వారు విమర్శిస్తున్నారు. మరోవైపు, పెరోల్ నిబంధనల అమలుపై ప్రభుత్వం కఠిన పర్యవేక్షణ చేపడుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

# కోనసీమలో ఓఎన్జీసీ గ్యాస్ లీకేజీ కలకలం



గ్యాస్ కార్పొరేషన్ డ్రిల్లింగ్ కేంద్రంలో భారీ గ్యాస్ లీకేజీ చోటుచేసుకుని పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సోమవారం మధ్యాహ్నం సుమారు పన్నెండు గంటల సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. ఓఎన్జీసీకి చెందిన మోరీఐదు బావి వద్ద గ్యాస్ పైప్‌లైన్ నుంచి ఒక్కసారిగా గ్యాస్ పైకి చిమ్మడంతో మంటలు వ్యాపించాయి. దాదాపు రెండు గంటల పాటు పెద్ద శబ్దాలతో గ్యాస్ లీక్ అవ్వడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పరిస్థితి అదుపు తప్పుతుందన్న ఆందోళనతో గ్రామస్తులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో సమీపంలోని కొబ్బరి తోటలకు మంటలు అంటుకొని విస్తృతంగా నష్టం వాటిల్లింది. ప్రాథమిక అంచనాల ప్రకారం ఐదు వందలకు పైగా కొబ్బరి చెట్లు పూర్తిగా కాలిపోయినట్లు అధికారులు భావిస్తున్నారు. కొబ్బరి సాగుపై ఆధారపడి జీవించే రైతులకు ఈ ఘటన పెద్ద దెబ్బగా మారింది. సమాచారం అందుకున్న వెంటనే రెవెన్యూ, పోలీస్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. ఇరుసుమండ గ్రామాన్ని పూర్తిగా ఖాళీ చేయించడంతో పాటు, చుట్టుపక్కల ఐదు కిలోమీటర్ల పరిధిలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాజమండ్రి నుంచి ఓఎన్జీసీ ఉన్నతాధికారులు, సాంకేతిక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించారు. మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడాలని, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంటలను త్వరితగతిన అదుపులోకి తీసుకురావాలని, ఘటనపై ఎప్పటికప్పుడు నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు.



# మాతృభాషను విస్మరిస్తే మన ఉనికినే కోల్పోయినట్లే

బాద్‌లో స్థాపించారని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత అదే స్ఫూర్తితో రాజమహేంద్రవరంలో తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటే భాషను మరింత సులభంగా పరిరక్షించుకోవచ్చని సీఎం సూచించారు. కొత్త యాప్‌లు, వాయిస్ టెక్నాలజీ ద్వారా తెలుగులో మాట్లాడినా సమాధానాలు లభిస్తున్నాయని, టైప్ చేయడం రాని వారు కూడా భాషను వినియోగించుకునే అవకాశాలు పెరిగాయని తెలిపారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి భావి తరాలకు అందించేందుకు ఇలాంటి ప్రపంచ తెలుగు మహాసభలు ఎంతో దోహదపడతాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. జనవరి 3న ప్రారంభమైన ఈ మహాసభలు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగాయి. ప్రపంచ నలుమూలల నుంచి తెలుగు భాషాభిమానులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# పాయకరావుపేట విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

అందజేయడం ద్వారా చదువులో వారికి మరింత ప్రోత్సాహం కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు. ఈ కార్యక్రమంలో సహచర మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ చేతుల మీదుగా విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. విద్యార్థులతో మాట్లాడిన వారు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు మత్తుపదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో చదువుపై దృష్టి పెట్టాలని నాయకులు పిలుపునిచ్చారు. ఉన్నత చదువులు చదివి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా వారికి హితవు పలికారు.

# చిన్నరాముడికి ఆంధ్ర సరస్వత పరిషత్ అవార్డు

చేసినందుకుగాను ఈ అవార్డును అందజేశామని ఆంధ్ర సరస్వత పరిషత్ ప్రతినిధులు, నిర్వాహకులు గజల్ శ్రీనివాస్ తెలిపారు. తెలుగు భాషపై ఉన్న మక్కువతో నగరపాలక సంస్థ కార్యాలయంలో సంతకాలు, తపాలా నివేదికలు, అధికారిక లేఖలు తదితరాలను మేనేజర్ యన్. చిన్నరాముడు పూర్తిగా తెలుగులోనే రూపొందిస్తారని తెలిపారు. ఇది ఉద్యోగుల్లోనూ, ప్రజల్లోనూ మాతృభాష పట్ల అవగాహనను పెంపొందిస్తోందని పేర్కొన్నారు. దీంతో ఆయనకు సహచర ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

# నాలెడ్జ్ బేస్డ్ సమాజ నిర్మాణంలో విశ్వవిద్యాలయాలే కేంద్ర బిందువు

ఏం అవసరం, మనం వారికి ఏం నేర్పిస్తున్నాం అన్న అంశాలపై లోతైన ఆలోచన అవసరమని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పరిశ్రమలతో విశ్వవిద్యాలయాల అనుసంధానం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఉద్యోగావకాశాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించే విధంగా బోధన ఉండాలని, రాబోయే దశాబ్దాన్ని దృష్టిలో పెట్టుకొని సిలబస్‌లో మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పరిశోధన, ఆవిష్కరణలు, నూతన ఆలోచనలకు యూనివర్సిటీలు కేంద్రాలుగా మారాలని సూచించారు. ప్రపంచ స్థాయి పబ్లిక్ విశ్వవిద్యాలయాలే మన లక్ష్యమని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ప్రభుత్వం, విద్యావేత్తలు, వీసీలు అందరూ కలిసి పనిచేస్తే ఈ లక్ష్యాన్ని సాధించడం సాధ్యమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఉన్నత విద్యా రంగాన్ని కొత్త దిశలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.




# నిడదవోలులో సీఎం సహాయ నిధి పంపిణీ

మన గళం, నిడదవోలు : అనారోగ్యంతో బాధపడుతున్న పేద ప్రజలకు భరోసా కల్పించే విధంగా నిడదవోలు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 61 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మొత్తం రూ.44.80 లక్షల విలువైన చెక్కులు, ఎల్‌వోసీ పత్రాలను రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 57 మందికి రూ.31.80 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశారు. అలాగే ముగ్గురు లబ్ధిదారులకు ఫైనాన్షియల్ అసిస్టెన్స్ కింద ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున మొత్తం రూ.9 లక్షల ఆర్థిక సాయం, మరో లబ్ధిదారుకు రూ.4 లక్షల విలువైన ఎల్‌వోసీ పత్రాలను అందజేశారు. ఇప్పటివరకు నిడదవోలు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 556 మందికి రూ.4 కోట్ల 9 లక్షల 17 వేల 825 రూపాయల ఆర్థిక సహాయం అందించడం సంతోషకరమని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. పేదరికం, అనారోగ్యం రెండూ కలిసివస్తే ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటారని, అలాంటి సమయంలో ప్రభుత్వం తమ వెంటే ఉందన్న భరోసా ఇవ్వడమే ఈ నిధి ఉద్దేశమని పేర్కొన్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో కూడిన సమాజాన్ని నిర్మించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు నిరంతరం సహకరిస్తున్న గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్లకు మంత్రి కందుల దుర్గేష్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.




# పెడనలో జలజీవన్ మిషన్ కింద నీటి ట్యాంకు శంకుస్థాపన

**– అచ్చయ్యవారి పాలెం పరిధిలో పనులకు శ్రీకారం – నలభై వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్ హెడ్ ట్యాంకు**

మన గళం, పెడన : పెడన నియోజకవర్గంలోని అచ్చయ్యవారి పాలెం గ్రామపంచాయతీ పరిధిలోని గౌడ పాలెం, జింజేరులో జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా తాగునీటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. మునిసిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులతో సుమారు రూ.27.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఓవర్ హెడ్ నీటి ట్యాంకు పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్‌తో కలిసి రాజమండ్రి ఎంపీ, మాజీ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి పాల్గొన్నారు. ప్రతిపాదిత నీటి ట్యాంకు నలభై వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించనుండటంతో, గౌడ పాలెం, జింజేరు గ్రామాల ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందుబాటులోకి రానుందని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పురంధేశ్వరి పేర్కొన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి శుద్ధి చేసిన తాగునీటిని అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ నీటి ట్యాంకు పూర్తయితే వేసవి కాలంలో కూడా నీటి కొరత లేకుండా ఉంటుందని ఆమె అన్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జోహార్, మునిసిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మాజీ చైర్మన్ మట్టా ప్రసాద్, ఎన్‌డిఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి ఇలాంటి మౌలిక వసతులు కీలకమని వారు అభిప్రాయపడ్డారు.



మా కలం.. మీ గళం.. మనగళం దిన పత్రిక

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ క్లినిక్ లు

**– కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ సమస్యల తక్షణ పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ లను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియం పీజీ ఆర్ ఎస్ లో భాగంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్ కు సంబంధించిన తొమ్మిది కౌంటర్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సమస్యల ఫిర్యాదులు స్వీకరిస్తున్న తీరు, రిజిస్ట్రేషన్ విధానాన్ని పరిశీలించారు. రెవెన్యూ క్లినిక్ కు సంబంధించి రిసెప్షన్, రిజిస్ట్రేషన్, ఆర్ఓఆర్ అప్పీళ్లు, ల్యాండ్ ఎన్క్రోచ్మెంట్స్, ఇనాం ల్యాండ్స్,ఇళ్ళ స్థలాలు, సర్వే, రీసర్వే సమస్యలు ఎండోమెంట్, వక్ఫ్ బోర్డ్ ల్యాండ్ సమస్యలు, 22ఏ, చుక్కల భూముల వెరిఫికేషన్కు డివిజన్ వారీగా టీంలతో 9 కౌంటర్లు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ల పర్యవేక్షణలో కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఇతర సిబ్బందిని నియమించి రెవెన్యూ క్లినిక్ కు వచ్చే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి అర్జీని పరిశీలించి, నిబంధనల ప్రకారం నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

# 11న ముగ్గుల పోటీలు



మనగళం, కర్నూలు సిటీ : బీవీ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బీవీ సుబ్బారెడ్డి ఇంటి ఎదుట ఖాళీ స్థలం ముగ్గుల పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు రూ.9116, రూ.6116, రూ. 3116 చొప్పున అందజేస్తామన్నారు. ఒక్కో మహిళకు గంట సమయం ఉంటుందని, ఒక హెల్పర్ కు అనుమతి ఉంటుందన్నారు. ఎంట్రీ ఫీజు రూ. 100 చెల్లించాల్సి ఉంటుందని, 9885 447069 నంబరుకు ఫోన్ పే చేసి పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. ఫోన్ పే చేసిన తర్వాత స్క్రీన్ షాట్ తీసి అదే నెంబర్ కి వాట్సప్ చేయాలన్నారు. ముగ్గులపోటీలోపాల్గొనే మహిళలు చంద్ర కుమారి సెల్ 8106373694 సంప్రదించాలని సూచించారు. న్యాయ నిర్ణేతలుగా కపేట చంద్రకుమారి, భూసయ్యగారి సుశీలమ్మ, బూసయ్యగారి ప్రభావతి వ్యవహరిస్తారన్నారు. బహుమతులను బీవీ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఎండీ, బీజేపీ సీనియర్ దాత బీవీ సుబ్బారెడ్డి అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అల్పాహారం అందజేస్తామన్నారు.

# సాయుధ దళాల ఫ్లాగ్ డే నిధికి విరాళాలందించండి

**– కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**



మనగళం, కర్నూలు సిటీ : దేశ రక్షణలో తమ ప్రాణాలను అంకితం చేసిన సైనిక కుటుంబాలు, మాజీ సైనికుల సంక్షేమం కోసం ఫ్లాగ్ డే నిధికి అధికారులు విరాళాలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పిలుపునిచ్చారు.జిల్లా పంచాయతీ అధికారి, ఇద్దరు డివిజనల్ పంచాయతీ అధికారులు, 25 మంది డిప్యూటీ ఎంపీడీవోలు రూ. 60 వేలు సాయుధ దళాల ఫ్లాగ్ డే నిధి కోసం విరాళం అందించారు. ఇందుకు సంబంధించిన చెక్ ను సోమవారం సునయన ఆడిటోరియంలో జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కర్ జిల్లా కలెక్టర్ కు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...దేశ సరిహద్దులను కాపాడుతూ నిరంతరం సేవలందిస్తున్న సాయుధ దళాల సిబ్బంది, వీరమరణం పొందిన సైనికుల కుటుంబాలు, మాజీ సైనికుల సంక్షేమానికి ఫ్లాగ్ డే నిధి అందించడం మన బాధ్యతగా భావించాలని, అన్ని శాఖల అధికారులు విరాళాలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి రత్న రూత్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యనారాయణకు నివాళి



మనగళం, కర్నూలు సిటీ : స్థానిక కల్లూరులోని సూర్యనారాయణ భవన్ లో సీపీఎం న్యూ సిటీ కార్యదర్శి టి. రాముడు అధ్యక్షతన కామ్రేడ్ సూర్యనారాయణ 38వ వర్ధంతి సభ నిర్వహించారు. పి.సూర్యనారాయణ చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్. నాయకులు ఎం.గోపాల్.ఎస్. రమణమూర్తి.కె. ప్రభాకర్, టి.రాముడు, సి.గురుశేఖర్, మహ్మద్ రఫీ తదితరులు పూల మాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ సూర్యనారాయణ ప్రజలకు చేసిన సేవలను సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, సీఐటీయూ సీనియర్ నాయకులు గోపాల్ గుర్తు చేశారు. పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీలో ఒక సాధారణ అప్రెంటిస్ గా చేరి యాజమాన్యం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేశారన్నారు. అదేవిధంగా ప్రజా సమస్యలపై ముందుండి పోరాడుతూ సూర్యనారాయణ ప్రజాదరణను పొందారని చెప్పారు. ఓర్వలేని ఫ్యాక్షన్ శక్తులు సూర్యనారాయణ పై కిరాయి మూకలతో బాంబు దాడులు చేయించి హత్య చేయించారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వి.శంకర్. లక్ష్మయ్య. శ్రీనివాసులు, అక్బర్, ఎస్.రోశయ్య, ఎస్.సత్యం, యస్.హుశేన్, వలి తదితరులు పాల్గొన్నారు.

# చలానా పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : పదిహేనేళ్లు దాటిన ఆటో, లారీ ఇతర వాహనాల రెన్యువల్ చార్జీలను భారీగా పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ కోరారు. ఈ మేరకు న్యూ సిటీ ఆటో యూనియన్ అధ్యక్షులు ఎస్ హుస్సేన్ వలి, ఉపాధ్యక్షులు. ఎస్. మాలిక్ బాషాతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరికి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువత కుటుంబ పోషణ కోసం ఆటోలు తీసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. అనేకమంది ఆటో డ్రైవర్లు 15 సంవత్సరాల దాటిన ఆటోలు నడుపుకుంటున్నారన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆటో, లారీ డ్రైవర్లు తదితరులు ఆందోళన బాట పడతామని చెప్పడంతో ప్రభుత్వం ప్రస్తుతానికి చలానా ధరలు పెంచమని చెప్పిందని గుర్తు చేశారు. అయితే 15 రోజులు కావస్తున్న ఇంతవరకు పెరిగిన చలానా ధరలు తగ్గించలేదని, పెంచిన రేట్లనే కొనసాగిస్తున్నారని ఆరోపించారు. నాన్ ట్రాన్స్పోర్ట్ వాహనాలైనా టూవీలర్లపై రాపిడ్ సంస్థ ఆన్లైన్లో బుకింగ్ ద్వారా ప్రయాణికులను టూ వీలర్ పై చేరవేస్తున్నారన్నారు. దీంతో ఆటో డ్రైవర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాన్ ట్రాన్స్పోర్ట్ వాహనాలకు ప్రయాణికులను చేరవేసే హక్కు లేదని, రాపిడ్ ప్రైవేట్ సంస్థలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# పారిశుద్ధ్యం మరింత మెరుగుపరచాలి

**– నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**



మనగళం, కర్నూలు సిటీ : నగరంలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ సంబంధిత సిబ్బందికి సూచించారు. సోమవారం ఆయన బళ్ళారి చౌరస్తా పరిసర ప్రాంతాల్లో పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రతిరోజు మధ్యాహ్నం తరువాత పూడికతీత పనులు పూర్తిగా జరిగేలా చూడాలని, వారానికి కనీసం ఒక్కసారి ప్రతి వీధిలో పూడికలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారులపై లేదా డ్రైనేజీ కాలువల్లో చెత్త వేస్తున్న వారిని గుర్తించి హెచ్చరించాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇంస్పెక్టర్లు అనిల్, దామోదర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సేవలను సమర్ధవంతంగా అమలు చేయాలి

**– కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**




మనగళం, కర్నూలు సిటీ : మిషన్ శక్తి పథకం కింద వన్ స్టాప్ సెంటర్ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియం ఆవరణలో మిషన్ శక్తి పథకం కింద జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన్ స్టాప్ సెంటర్ (సఖీ కేంద్రం) కు సంబంధించిన వాహనాన్ని జిల్లా కలెక్టర్ సోమవారం జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న హింస, వేధింపులు, కుటుంబ సమస్యలు ఎదుర్కొంటున్న బాధితులకు తక్షణ సహాయం, రక్షణ, అవసరమైన సేవలు అందించడంలో ఈ వాహనం కీలక పాత్ర పోషించాలన్నారు. మహిళా భద్రత, బాలల హక్కులు, గృహ హింస నివారణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ వాహనాన్ని వినియోగించాలని సూచించారు. బాధితులకు న్యాయం, భద్రత,గౌరవం కల్పించడమే వన్ స్టాప్ సెంటర్ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. విజయ, వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ పి. మేరీ స్వర్ణలత, సంబంధిత అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# సాయి స్పోర్ట్స్ కేంద్రాన్ని తరలించొద్దు

మనగళం, కర్నూలు సిటీ : శాయి స్పోర్ట్స్ హాస్టల్ ను తిరుపతికి తరలించే ప్రయత్నాన్ని రాష్ట్ర క్రీడా శాఖ అధికారులు విరమించుకోవాలని కోరుతూ జిల్లా క్రీడా సంఘాల జేఏసీ కన్వీనర్ కె .నాగరత్నమయ్య జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాగరత్నమయ్య మాట్లాడుతూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయి) ట్రైనింగ్ సెంటర్ ను కర్నూల్ లోనే కొనసాగించాలని కోరారు. భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయనే నెపంతో తిరుపతికి తరలించేందుకు అధికారులు కుమ్మక్కై కుట్ర చేస్తున్నార ని ఆయన ఆరోపించారు. కర్నూల్ అవుట్డోర్ స్టేడియంలో ఉన్న కొత్త భవనాలను ప్రత్యామయంగా ఉపయోగించుకునేలా చూడాలని కలెక్టర్ ను కోరారు.

## కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : హంద్రీ నీవా కాలువల కింద భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందించాలని కోరుతూ ముత్తుకూరు గౌడప్ప సంఘం ఆధ్వర్యంలో తెర్నెకల్ గ్రామ రైతులు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. రైతులకు పరిహారం ఇవ్వకుండా భూసేకరణ చేస్తున్నారని,రీ సర్వేలో భూములు కాల్వకింద పోయినట్లు చూపిస్తున్నారని అన్నారు. సాగు చేసుకుంటున్న భూమిని శాశ్వతంగా కోల్పోతున్నాము కాబట్టి ఎకరాకు రూ. 20లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసారు. పరిహారం ఇవ్వకుండా కాలువలకు భూములు తీసుకుంటే అంగీకరించేది లేదని హెచ్చరించారు. రైతుల నిర్వహించిన ధర్నాలో రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ పాల్గొన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం పరిహారం అందించేవరకు వారు చేసే పోరాటానికి మద్దతుగా ఉంటామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ముత్తుకూరు గౌడప్ప సంఘం అధ్యక్షుడు సత్యన్న, సీపీఐ అనుబంధ రైతు సంఘం నాయకుడు శ్రీనివాసరావు, బీసీ సంఘం నేత శేషఫణి, రైతు సంఘం నాయకులు బడే సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# వీధి దీపాల మరమ్మతులను ఆలస్యం చేయొద్దు

**– నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలోని ప్రతి వీధి విద్యుత్ కాంతులతో వెలగాలని, వీధి దీపాలు చెడిపోయిన వెంటనే ఎలాంటి ఆలస్యం లేకుండా మరమ్మతులు చేపట్టి కొత్త దీపాలు అమర్చే విధంగా చొరవ చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. వీధి విద్యుత్ దీపాల కోసం ఇప్పటికే రూ.60 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో త్వరితగతిన కొత్త దీపాలు తెప్పించి, మరమ్మతులకు గురైన వీధి దీపాల స్థానంలో వెంటనే కొత్తవి అమర్చాలని సూచించారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ కాలనీలకు చెందిన ప్రజల నుంచి 23 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, కార్యదర్శి నాగరాజు, ఎస్.ఈ జె.రమణ మూర్తి, ఎం.ఈ మనోహర్ రెడ్డి, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, ఆర్.ఓ జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు. శునకాల బెడద నియంత్రణకు చర్యలు తీసుకోవాలి: బుధవారపేట స్మశాన వాటిక వద్ద ముళ్లకంపలను తొలగించాలని, శునకాల బెడద నియంత్రణకు చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ ఇంచార్జీ పి.సురేష్, ప్రదీప్ తదితరులు కోరారు. 4వ తరగతి ఉద్యోగుల కాలనీలో తమ ఇళ్ల ఎదుట స్థలం అపరిశుభ్రంగా ఉందని, వెంటనే శుభ్రం చేయించాలని సి.హెచ్.బాలచంద్ర విన్నవించారు. శకుంతల కళామందిర్ వద్ద వీధి విద్యుత్ దీపాలు వెలగడం లేదని స్థానికులు రవి కుమార్, బాషాతదితరులు ఫిర్యాదు చేశారు.

## సూపర్ కప్ ఫుట్ బాల్ కు జిల్లా క్రీడాకారులు ఎంపిక



మనగళం, కర్నూలు సిటీ : అనంతపూర్ ఆర్టీడీలో గ్రౌండ్స్ లో ఈనెల 28న జరిగే ఆంధ్రప్రదేశ్ సుపర్ కప్ ఫుట్ బాల్ పోటీలకు కర్నూలు జిల్లా క్రీడాకారులు రవికుమార్, గణేష్,నరసింహుడు ఎంపికయ్యారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిష్టాత్మకమైన ఫూట్ బాల్ టోర్నమెంట్ కు ఎంపిక కావడం చాలా గొప్ప విషయమని జిల్లా ఫూట్ బాల్ సంఘం నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

## సమావేశమైన చల్లా కుటుంబ సభ్యులు



మనగళం, అవుకు : కృషి పండిట్, దివంగత ఎమ్మెల్యే చల్లా రామక్రిష్ణారెడ్డి కుటుంబ సభ్యులు అవుకు గ్రామంలోని చల్లా ప్రజాభవన్ లో సమావేశమయ్యారు. చల్లా సూర్య ప్రకాష్ రెడ్డి, చల్లా రాజశేఖర్ రెడ్డి, చల్లా అమర్నాథ్ రెడ్డి, చల్లా ప్రభాకర్ రెడ్డి, చల్లా రఘునాథ్ రెడ్డి, చల్లా రామేశ్వర్ రెడ్డి, చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, చల్లా చరణ్ రెడ్డి, చల్లా విక్రాంత్ రెడ్డి సమావేశమై వివిధ అంశాలపై చర్చించుకున్నారు. భవిష్యత్తులో కలిసిమెలిసి ముందుకెళ్లాలని చల్లా కుటుంబ సభ్యులు ఐకమత్యంగా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

## లీగల్ ఎయిడ్ ప్యానల్ లాయర్స్ విధులపై రివ్యూ మీటింగ్





మనగళం, కర్నూలు సిటీ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జి.కబర్ధి సూచనల మేరకు కమిటీ మెంబర్, మొదటి అదనపు జిల్లా జడ్జి పి. కమలాదేవి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి. లీలా వెంకట శేషాద్రి సోమవారం న్యాయ సేవా సదన్ లో ప్యానల్ లాయర్స్ విధులపై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యానల్ లాయర్స్ విధులు, చట్టపరమైన సలహాలు, కేసుల వివరాలు, పరిష్కారం తదితర అంశాలను వివరించారు. అలాగే కేసుల స్థితిగతులను తెలుసుకొని వాటిని ఏ విధంగా త్వరిత గతిన పరిష్కరించాలనే విషయాలపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సులోచన, ప్యానల్ న్యాయ వాదులు పాల్గొన్నారు.

## క్రీడాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

**– మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్**





మనగళం, కర్నూలు సిటీ : నగరంలో క్రీడల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరు సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. సోమవారం స్థానిక అవుట్ డోర్ స్టేడియం నందు కర్నూల్ ఉమ్మడి జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ తాము మొదటి నుంచి క్రీడల అభివృద్ధికి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. రాయలసీమ యూనివర్సిటీ నందు ఇండోర్ స్టేడియం, ఏపీ ఎస్పీ బెటాలియన్ నందు మరో స్టేడియంని సొంత నిధులతో, అవుట్డోర్ స్టేడియం నందు మరో ఇండోర్ స్టేడియం ను ప్రభుత్వ విధులతో నిర్మించినట్టు ఆయన తెలిపారు. అలాగే పంచలింగాల గ్రామంలో మరో స్టేడియంని నిర్మించేందుకు తలపెట్టినప్పుడు ఎంతోమంది రాజకీయంగా అడ్డుకున్నారని ఆయన తెలిపారు. అయినప్పటికీ రాజకీయ అడ్డంకులు అన్నింటిని అధిగమించి అక్కడ కూడా స్టేడియంను ఏర్పాటు చేసినట్టు టీజీ వెంకటేష్ గుర్తు చేశారు. ప్రస్తుతం జోహారాపురం ప్రాంతంలో ఉన్న పాత డంప్ యార్డ్ నందు ఫుట్బాల్ స్టేడియం, క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు ఎంతగానో ప్రయత్నిస్తున్నామని, దానికి కూడా ఎంతోమంది అడ్డు తగిలారని టీజీ వెంకటేశ్ వివరించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడలలో కర్నూలు జిల్లా అగ్రభాగంలో ఉందని, దీనిని ప్రతి ఒక్కరు కాపాడుకుంటూ క్రీడల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డి ఎస్ డి ఓ భూపతిరావు, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు భార్గవ, దాశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# పథకాల ఆవశ్యకతను ప్రజలకు వివరించండి

**– సామాజిక మాధ్యమాల ప్రభావకులతో కమిషనర్ పి.విశ్వనాథ్ – ఎల్ఆర్‌యస్, బిపియస్, ఎస్ఐఆర్‌లలపై అవగాహన**



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలో అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్‌యస్), బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బిపియస్) పథకాల ఆవశ్యకతను సామాజిక మాధ్యమాల ద్వారా స్పష్టంగా ప్రజలకు వివరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ సామాజిక మాధ్యమాల ప్రభావకులకు సూచించారు. నగరంలోని సామాజిక మాధ్యమాల ప్రభావకులకు నగరపాలక కార్యాలయంలో ఎల్ఆర్‌యస్, బిపియస్ పథకాలతో పాటు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ సర్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆధునిక సమాచార వ్యవస్థలో సమాజాన్ని వేగంగా అనుసంధానించే వేదికగా సామాజిక మాధ్యమాలు శక్తివంతంగా మారాయని, వీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటే ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి స్పష్టత తీసుకురావచ్చని తెలిపారు. ఎల్ఆర్‌యస్ ద్వారా అనధికార లేఔట్లను, బిపియస్ ద్వారా అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. నిర్ణీత గడువు లోపు దరఖాస్తులు చేసుకుంటే జరిమానా తక్కువగా ఉంటుందని, గడువు దాటితే ఆర్థిక భారం పెరిగే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచడంలో సామాజిక మాధ్యమాల ప్రభావకులు కీలక పాత్ర పోషించాలని కోరారు. అలాగే ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ సర్) ద్వారా ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, లోపాల్లేని విధంగా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు. కర్నూలు నియోజకవర్గ పరిధిలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసినట్లు తెలిపారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం, 2002 సంవత్సరంలో నిర్వహించిన ఇంటెన్సివ్ రివిజన్ నాటి ఓటర్ల జాబితాను, ప్రస్తుతం ఉన్న 2025 ముసాయిదా ఓటర్ల జాబితాతో సరిపోల్చే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. బిఎల్వోలు ఐడి కార్డులతోనే ఓటర్ల వద్దకు వస్తారని, ఎలాంటి ఓటిపిలు అడగరని స్పష్టం చేశారు. ఎల్ఆర్‌యస్, బిపియస్ పథకాలను నగర ప్రజలు సత్వరమే ఉపయోగించుకునేలా, అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియలో బిఎల్వోలు ఓటర్ల వద్దకు వచ్చినప్పుడు సహకరించి అవసరమైన వివరాలు అందించేలా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కమిషనర్ ప్రభావకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న, ప్లానింగ్ కార్యదర్శి అనంత వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టపరంగా న్యాయం చేస్తాం

**– డీఐజీ, కర్నూలు జిల్లా ఇన్ చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్**

మనగళం, కర్నూలు క్రైం : కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో డీఐజీ, కర్నూలు జిల్లా ఇన్ చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల నుంచి వినతులను డీఐజీ స్వీకరించారు. బాధితులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 84 ఫిర్యాదులు వచ్చాయని పోలీసులు తెలిపారు. ఇన్ ఫ్రా ప్రాజెక్టుల పేరుతో భూములు ఇప్పిస్తానని, రెవిన్యూ శాఖలో 6 మందికి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి సల్కాపురం ప్రవీణ్ కుశల్ రూ. 52 లక్షలు తీసుకొని మోసం చేశాడని కర్నూలు, గీతా నగర్ కు చెందిన మల్లికార్జున ఫిర్యాదు చేశారు. బాగా పండిన 8 క్వింటాల కంది పంటను రాత్రి వేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు కోసుకొని వెళ్ళారని, చర్యలు తీసుకోవాలని కర్నూలు, పసుపుల గ్రామ పంచాయితికి చెందిన రమణ ఫిర్యాదు చేశారు. స్థలం రిజిస్ట్రేషన్ దగ్గర చీటింగ్ చేసిన వ్యక్తుల పై చర్యలు తీసుకోవాలని కర్నూలు మండలం, ఉల్చాల గ్రామానికి చెందిన చిన్న నాగరాజు ఫిర్యాదు చేశారు. హ్యూజ్ ఆన్ లైన్ లో ప్రమోషన్ వీడియోలు చూడడం ద్వారా వారానికి, నెలకు తిరిగి డబ్బులు ఇస్తామని చెప్పి నమ్మించి రూ. రూ. 3 లక్షలు పెట్టుబడి పెట్టించి మోసాలు చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని కర్నూలు, క్రిష్ణనగర్ కు చెందిన ప్రభుదాస్ ఫిర్యాదు చేశారు. సతీష్ రెడ్డి అనే వ్యక్తి గణేష్ నగర్ లోని రామచంద్రమిషన్ కు ధ్యానం నిమిత్తం వస్తూ పరిచయం చేసుకుని క్రెడిట్ కార్డు పరిమిషన్ తో , యాప్ సెటప్ యాక్సిస్ సెట్టింగ్ లో క్రిడెట్ కార్డు తో రూ. 8 లక్షలు , పర్సనల్ లోన్ క్రింద రూ. 2 లక్షలు తీసుకుని నమ్మించి మోసం చేశాడని కర్నూలు, గణేష్ నగర్ కు చెందిన వినీత్ కుమార్ ఫిర్యాదు చేశారు. డబ్బు చెల్లించకుండా కర్నూలు వదిలి వెళ్ళాడని, న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదులపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని ఈ సందర్భంగా ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, సీఐలు విజయలక్ష్మీ, కంబగిరి రాముడు పాల్గొన్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## యుద్ధాల నీడలో అనాథలైన బాల్యం

ప్రపంచం వేగంగా ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తున్నా, అదే సమయంలో యుద్ధాల నీడలో వేలాది పిల్లల బాల్యం చీకట్లోకి నెట్టబడుతోంది. తుపాకీ మోతలు, బాంబుల శబ్దాల మధ్య తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల దుస్థితిని గుర్తు చేసే రోజే ప్రపంచ యుద్ధ అనాథల దినం. ఇది కేవలం ఒక స్మరణ దినం కాదుడ మన మానవత్వాన్ని ప్రశ్నించే రోజు.యుద్ధం అనేది సైనికుల మధ్య జరిగే పోరాటంగా మాత్రమే చాలామంది భావిస్తారు. కానీ యుద్ధం నిజంగా అత్యంత భీకరంగా దెబ్బతీసేది పిల్లల జీవితాలనే. తండ్రిని కోల్పోయిన బిడ్డ, తల్లిని కోల్పోయిన బాలిక వీరి కళ్లలో భయం, అనిశ్చితి, భవిష్యత్తుపై సందేహం స్పష్టంగా కనిపిస్తాయి. ఆటపాటల వయసులో బాధ్యతల భారం మోసే పరిస్థితికి వారు నెట్టబడుతున్నారు.తల్లిదండ్రుల మరణంతో పిల్లలు కేవలం కుటుంబాన్ని కాదుడ భద్రతను, ప్రేమను, దిశను కూడా కోల్పోతారు. అనాథ శిబిరాలు, శరణార్థ శిబిరాల్లో పెరిగే పిల్లలకు సరైన విద్య, ఆరోగ్యం, మానసిక భద్రత అందకపోవడం ఒక పెద్ద విషాదం. పునరావాసం పేరుతో ఇచ్చే సహాయం చాలాసార్లు తాత్కాలికంగానే మిగిలిపోతోంది.విద్య అనేది యుద్ధ అనాథల జీవితాల్లో వెలుగు నింపే ప్రధాన ఆయుధం. కానీ యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో పాఠశాలలు ధ్వంసమవ్వడం, ఉపాధ్యాయుల కొరత, పేదరికం కారణంగా అనేక మంది పిల్లలు చదువుకు దూరమవుతున్నారు. చదువు లేకపోతే ఆ పిల్లల భవిష్యత్తు మరింత ప్రమాదకరంగా మారుతుంది. బాల కార్మికత్వం, అక్రమ రవాణా, నేరాల వలలో చిక్కే ప్రమాదం పెరుగుతోంది.యుద్ధ అనాథల సమస్యను కేవలం దయా దృష్టితో చూడటం సరిపోదు. ఇది ఒక మానవ హక్కుల సమస్య. ప్రతి పిల్లవాడికి భద్రత, విద్య, గౌరవంతో జీవించే హక్కు ఉంది. అంతర్జాతీయ సంస్థలు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.ప్రపంచ యుద్ధ అనాథల దినం మనకు ఒక హెచ్చరిక. యుద్ధాల విజయాల గురించి కాదుడ వాటి వల్ల నాశనమైన బాల్యాల గురించి ఆలోచించమని చెప్పే రోజు ఇది. శాంతి అనేది రాజకీయ నినాదం కాదుడ అది పిల్లల చిరునవ్వుల్లో కనిపించాలి. యుద్ధాలకంటే మానవత్వం గెలిచే ప్రపంచం కోసం ఈ రోజు ప్రతి ఒక్కరినీ ఆలోచనలోకి నెట్టాలి.

ప్రపంచం వేగంగా ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తున్నా, అదే సమయంలో యుద్ధాల నీడలో వేలాది పిల్లల బాల్యం చీకట్లోకి నెట్టబడుతోంది. తుపాకీ మోతలు, బాంబుల శబ్దాల మధ్య తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల దుస్థితిని గుర్తు చేసే రోజే ప్రపంచ యుద్ధ అనాథల దినం. ఇది కేవలం ఒక స్మరణ దినం కాదుడ మన మానవత్వాన్ని ప్రశ్నించే రోజు.యుద్ధం అనేది సైనికుల మధ్య జరిగే పోరాటంగా మాత్రమే చాలామంది భావిస్తారు. కానీ యుద్ధం నిజంగా అత్యంత భీకరంగా దెబ్బతీసేది పిల్లల జీవితాలనే. తండ్రిని కోల్పోయిన బిడ్డ, తల్లిని కోల్పోయిన బాలిక వీరి కళ్లలో భయం, అనిశ్చితి, భవిష్యత్తుపై సందేహం స్పష్టంగా కనిపిస్తాయి. ఆటపాటల వయసులో బాధ్యతల భారం మోసే పరిస్థితికి వారు నెట్టబడుతున్నారు.తల్లిదండ్రుల మరణంతో పిల్లలు కేవలం కుటుంబాన్ని కాదుడ భద్రతను, ప్రేమను, దిశను కూడా కోల్పోతారు. అనాథ శిబిరాలు, శరణార్థ శిబిరాల్లో పెరిగే పిల్లలకు సరైన విద్య, ఆరోగ్యం, మానసిక భద్రత అందకపోవడం ఒక పెద్ద విషాదం. పునరావాసం పేరుతో ఇచ్చే సహాయం చాలాసార్లు తాత్కాలికంగానే మిగిలిపోతోంది.విద్య అనేది యుద్ధ అనాథల జీవితాల్లో వెలుగు నింపే ప్రధాన ఆయుధం. కానీ యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో పాఠశాలలు ధ్వంసమవ్వడం, ఉపాధ్యాయుల కొరత, పేదరికం కారణంగా అనేక మంది పిల్లలు చదువుకు దూరమవుతున్నారు. చదువు లేకపోతే ఆ పిల్లల భవిష్యత్తు మరింత ప్రమాదకరంగా మారుతుంది. బాల కార్మికత్వం, అక్రమ రవాణా, నేరాల వలలో చిక్కే ప్రమాదం పెరుగుతోంది.యుద్ధ అనాథల సమస్యను కేవలం దయా దృష్టితో చూడటం సరిపోదు. ఇది ఒక మానవ హక్కుల సమస్య. ప్రతి పిల్లవాడికి భద్రత, విద్య, గౌరవంతో జీవించే హక్కు ఉంది. అంతర్జాతీయ సంస్థలు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.ప్రపంచ యుద్ధ అనాథల దినం మనకు ఒక హెచ్చరిక. యుద్ధాల విజయాల గురించి కాదుడ వాటి వల్ల నాశనమైన బాల్యాల గురించి ఆలోచించమని చెప్పే రోజు ఇది. శాంతి అనేది రాజకీయ నినాదం కాదుడ అది పిల్లల చిరునవ్వుల్లో కనిపించాలి. యుద్ధాలకంటే మానవత్వం గెలిచే ప్రపంచం కోసం ఈ రోజు ప్రతి ఒక్కరినీ ఆలోచనలోకి నెట్టాలి.

# సిపిఐ పోరాట ఫలితమే ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు





మన గళండోన్ ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు ప్రత్యేక ప్రణాళిక కింద నిధులు మంజూరు కోసం సిపిఐ జిల్లా రాష్ట్రాల్లో పోరాటం చేసినందువలన సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయడం జరిగిందని డోన్ మున్సిపల్ సిపిఐ 16 అవార్డు కౌన్సిలర్ పి సుంకయ్య అన్నారు. గత నాలుగు సంవత్సరాల క్రితం నుండి డోన్ మున్సిపల్ కౌన్సిల్లో సిపిఐ మున్సిపల్ కౌన్సిలర్ గా మున్సిపల్ కౌన్సిల్లో ఎస్సీ సబ్ బ్రాన్ నిధులు విడుదల కోసం చర్చించి కౌన్సిల్లో తీర్మానం చేసి రాష్ట్ర స్థాయి ఎస్సీ సబ్ ప్లాన్ కమిషనర్ విన్నవించడమే కాక డోన్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో భాగంగా జిల్లా కలెక్టర్కు సిపిఐ మున్సిపల్ కౌన్సిలర్ గా ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయాలని కలెక్టర్కు ప్రత్యేక అర్జీ ఇవ్వడం జరిగింది. రాష్ట్రస్థాయి ఎస్సీ సబ్ ప్లాన్ కమిషనర్ మరియు జిల్లా కలెక్టర్ గారు డోన్ మున్సిపల్ కు రెండు కోట్ల నిధులు విడుదల చేయడం జరిగింది.ఈ రెండు కోట్ల నిధులు ఎస్సీలు నివసిస్తున్న శివారు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం కోసం డోన్ మున్సిపల్ కౌన్సిల్లో తీర్మానించి ఎస్టిమేషన్ వేయడం జరిగింది . అలాగే టెండర్లు కూడా పూర్తి అయిన వెంటనే ఈరోజు 16వ వార్డుకు ప్రాతినిధ్యం వహిస్తున్న సిపిఐ మున్సిపల్ కౌన్సిలర్ సుంకయ్య ఆధ్వర్యంలో డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య సూర్య ప్రకాష్ రెడ్డి గారు మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రిక హరికిషన్ గారు డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ మున్సిపల్ ఐజు;ాజు, గార్లు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. 16వ వార్డులో క్రిస్టియన్ సమాధుల ఆవరణంలో మంచినీళ్ళ బోరు వాటర్ ట్యాంకు సైడ్ వాల్స్ పనులకు సంబంధించి ప్రారంభించడం జరిగింది . అలాగే వీడోస్ కాలనీ లో సీసీ రోడ్డు కాలువ ప్రధాన రహదారిపై డ్రైన్, త్రివర్ణ కాలనీ 17 వ వార్డులో సీసీ రోడ్డు కాలువలు, అలాగే వైయస్ నగర్ సిపిఐ కాలనీ నందు సిసి రోడ్లు కాలువలకు భూమి పూజ చేసి ప్రారంభించడం జరిగింది. కాంట్రాక్టర్లు వెంటనే పనులు ప్రారంభించి ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందించేందుకు సహకరించాలని సుంకయ్య మనవి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నారాయణ పట్టణ కన్వీనర్ మోటా సిపిఐ నాయకులు పులి శేఖర్ అబ్బాస్ పృథ్వీ కుమార్ రామ్మోహన్ రాముడు మహిళా సమైక్య నాయకురాలు లక్ష్మీదేవి ప్రమేల మేరమ్మ వనం లక్ష్మి హాజరయ్యారు అలాగే తెలుగుదేశం పార్టీ నాయకులు వలసల రామకృష్ణ వెంకటనారాయణ పల్లె శ్రీనివాసులు శేషు ఫణి గౌడ్ రాఘవేంద్ర గౌడ్ అనేకమంది సిపిఐ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అలాగే క్రిస్టియన్ సమైక్య అసెంబ్లీ పాస్టర్లు రాజశేఖర్ జాకపాల్ అనేకమంది పాస్టర్లు హాజరయ్యారు.

# శివుని అభిషేక కార్యక్రమం లో పాల్గొన్న కోట్ల దంపతులు

మన గళండోన్ కోట్ల కుటుంబం ఆధ్వర్యంలో డోన్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆరోగ్యవంతంగా, శాంతిసమృద్ధులతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ రోజు డోన్ పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శివుని అభిషేక కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ,డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పాల్గొన్నారు.ఈ పవిత్ర ఆధ్యాత్మిక కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పరమేశ్వరుని ఆశీస్సులు పొందారు. శివుని అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించి నియోజకవర్గ ప్రజల సర్వతోముఖాభివృద్ధికి సంకల్పం చేశారు.ఈ సందర్భంగా డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, శాంతి, ఐక్యత కోసం ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. భక్తి, సంప్రదాయం, సేవా భావం కలిసినప్పుడు సమాజంలో సానుకూల మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు.కోట్ల కుటుంబం ఆధ్వర్యంలో భవిష్యత్తులో కూడా ఇటువంటి ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు



# గ్రామసభ నిర్వహించిన మండల అధికారులు...

– గ్రామ సభకు హాజరైన బిజెపి నేత గురురాజ్ దేశాయ్...







నందవరం జనవరి 5 మనగళం న్యూస్... నందవరం మండలంలోని నందవరం పంచాయతీ అవరణలో పంచాయతీ అధికారుల అధ్వర్యంలో గ్రామసభ నిర్వహించటం జరిగింది.ఈ కార్యక్రమానికి బిజెపి నేత గురురాజ్ దేశాయ్ హాజరైనారు ఈ సందర్భంగా గురురాజ్ దేశాయ్ మాట్లాడుచూ గ్రామసభ అనేది మనగ్రామం అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం ప్రజలకు కల్పించిన ఒక గొప్ప అవకాశం అన్నారు కోట వీదిలో బీసీ కాలనీ మరియు ాజ కాలనిలో కొన్ని చోట్ల సిమెంటు రోడ్లు లేక ప్రజలు చాలా ఇబ్బందిపాడుచున్నారు కాబట్టి వీటిని త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చెయ్యాలని అధికారులను కోరారు.పరిశుధ్యకార్మికులకు ప్రస్తుతం 8000 రూపాయలు వేతనం ఇస్తున్నారు కానీ వారుచేసే కృషికి వారికి నెలకు 15000 రూపాయలు చెయ్యాలని అధికారులను డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పతకంలో అక్రమాలు చాలా చేస్తున్నారు ఉపాధి వేతనదారుల కడుపుకొట్టి మేటీలు ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రజల కష్టాలను సొమ్ముచేసుకొంటున్నారని ఇలాంటి అక్రమాలు జరగకుండా అదికారులు తగిన చర్యలు తీసుకొవాలని ఇలాంటి అవినీతిపరులను ఇకముందు వదిలిపెట్టే ప్రశక్తే లేదని తెలియచేశారు.15వ ఫైనాన్స్ క్రింద బిజెపి కేంద్రప్రభుత్వం ప్రతి పౌరునికి ప్రతిసంవత్సరం 850 రూపాయలచొప్పున గ్రామ అభివృద్ధి కొరకు నేరుగా పంచాయతీ కాతాలో జమచేస్తుందని ఇలాంటి నిదులను సక్రమమార్గంలో గ్రామాభివృద్ధికి ఉపయోగించాలని అధికారులను కోరారు ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచు సావిత్రి యు ఆర్ డి సందీప్ ఉపాధి హామీ పతకం మండల ాూ శ్రీనివాసులు సచివాలయం అదికారులు, నాయకులు, గ్రామపెద్దలు మరియు పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రంలో తొలిసారి భారీగా విద్యుత్ ఛార్జీలు తగ్గింపు ఎమ్మెల్యే కోట్ల

మన గళండోన్లిపట్టణంలోని టిడిపి పార్టీ కార్యాలయంలో ఈరోజు సోమవారం ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే తొలిసారి సీఎం చంద్రబాబు నాయుడు భారీగా విద్యుత్తు ఛార్జీలు తగ్గించారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ వారి గృహాలకు కూడా పూర్తిగా విద్యుత్ ఛార్జీలు చెల్లించనవసరం లేదని తెలిపారు. ప్రతి గ్రామానికి జలజీవన్ మిషన్ ద్వారా తాగునీరు అందిస్తామని మరియు ప్రతి చెరువుకు సాగునీరు అందే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ప్యాపిలి మండలంలోని గుడిపాడు చెరువుకు మోటార్ల ద్వారా నీరు నింపుతామని తెలిపారు. గ్రామాలలో పట్టణాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి నిఘా వ్యవస్థను అమలు చేశారని పట్టణంలో సీసీ కెమెరాలు ద్వారా అల్లరి ముఖాల చేష్టలు అరికట్టారని తెలిపారు. ప్యాపిలి పట్టణంలో ప్రభుత్వం ద్వారా రైతులకు కందులు పెసులు మద్దతు ధర కల్పించి కొనుగోలు కేంద్రం ప్రారంభించామని అన్నారు. కావున ఈ యొక్క అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉల్లి రైతులకు కర్నూలు జిల్లాలో చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నష్టపరిహారం చెల్లించారని అక్కడ కేవలం వర్షాధారపు ఉల్లి పంట రైతులు వేయడం వలన నష్టపరిహారం చెల్లించారని తెలిపారు. మన జిల్లాలో బోర్లు బావుల కింద ఉల్లి పంట వేయడం వలన




ప్రభుత్వం నుంచి రావాల్సిన ఉల్లి రైతులకు నష్టపరిహారం చెల్లించలేదని అది కూడా త్వరలో సీఎం చంద్రబాబు నాయుడు తో మాట్లాడి ఇక్కడ కూడా మంజూరు చేయిస్తానని తెలిపారు.

# ప్రతి అర్జీకి స్పష్టమైన పరిష్కారం చూపాలి

**– నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**

మనగళం, నంద్యాల : ప్రజల సమస్యలను సీరియస్‌గా పరిగణించి ప్రతి అర్జీకి స్పష్టమైన పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, ఇతర అధికారులు జిల్లా నలుమూలల నుంచి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అదేవిధంగా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా భూ సమస్యలకు సంబంధించి 255 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ వేదిక ద్వారా అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి స్పష్టమైన నిర్ణయాలతో పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున, అధికారులు మరింత బాధ్యతతో, చొరవతో వేగవంతంగా అర్జీలను పరిష్కరించాలన్నారు. రీ–ఓపెన్ అయిన దరఖాస్తులు, ఎస్ఎల్ఏ గడువు మించిన అర్జీలు, వీఐపీ గ్రీవెన్స్‌లను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఆడిట్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత కాలపరిమితిలోగా వాటిని క్లియర్ చేయాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమగ్ర కుటుంబ సర్వేను జనవరి నెలాఖరు నాటికి పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.




రహదారి సమస్యను పరిష్కరించండి : నంద్యాల పట్టణానికి చెందిన రిటైర్డ్ లెక్చరర్ నారాయణరెడ్డి రుద్రవరం మండలం కొత్తూరు నుంచి గుండెంపాడు వరకు రహదారి సంబంధిత సమస్యపై జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు. స్పందించిన జిల్లా కలెక్టర్ సంబంధిత వివరాలు పరిశీలించి నివేదిక సమర్పించాల్సిందిగా వెంటనే తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆత్మకూరు మండలానికి చెందిన రత్నమ్మ తన యావదాస్తిని కుమారులు స్వాధీనం చేసుకొని తన బాగోగులు పట్టించుకోవడం లేదని జిల్లా కలెక్టర్‌కు తెలియజేశారు. స్పందించిన జిల్లా కలెక్టర్, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం ప్రకారం తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత కుమారులదేనని వారికి అవగాహన కల్పించి, ఆమె బాగోగులు చూసేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆత్మకూరు ఆర్డీఓను ఆదేశించారు. దొర్నిపాడు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన మంగళి నాగేశ్వరరావు తాను వైకల్యంతో బాధపడుతున్నందున పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా స్వీకరించిన 139 అర్జీదారుల సమస్యలన్నింటినీ నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**– కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రతిబింబించేలా శకటాలు ఏర్పాటు చేయాలి – నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

మనగళం, నంద్యాల : 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ అనంతరం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నంద్యాల పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఇప్పటినుంచే ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. కళాశాల మైదానం సుందరీకరణ, జెండా వందనం ఏర్పాట్లు ఆకర్షణీయంగా చేపట్టాలని నంద్యాల ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. దేశభక్తి ఉట్టిపడేలా ప్రతి కార్యక్రమం 15 నిమిషాల నిడివి గల నాలుగు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని డీఈఓను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలని, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌కు సంబంధించిన ఎటువంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఐ అండ్ పిఆర్ అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులకు ఆహ్వాన పత్రికలను వేడుకలకు రెండు రోజుల ముందుగానే అందజేయాలని డిఆర్‌ఓకు సూచించారు. ప్రతి శాఖ నుండి ఉత్తమ సేవలు అందించిన ఇద్దరు ఉద్యోగుల పేర్లను మాత్రమే ప్రశంస పత్రాలకు సిఫారసు చేయాలని స్పష్టం చేశారు.గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి– కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రతిబింబించేలా శకటాలు ఏర్పాటు చేయాలి– నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియామనగళం, నంద్యాల : 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ అనంతరం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి రాము




నాయక్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నంద్యాల పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఇప్పటినుంచే ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. కళాశాల మైదానం సుందరీకరణ, జెండా వందనం ఏర్పాట్లు ఆకర్షణీయంగా చేపట్టాలని నంద్యాల ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. దేశభక్తి ఉట్టిపడేలా ప్రతి కార్యక్రమం 15 నిమిషాల నిడివి గల నాలుగు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని డీఈఓను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలని, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌కు సంబంధించిన ఎటువంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఐ అండ్ పిఆర్ అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులకు ఆహ్వాన పత్రికలను వేడుకలకు రెండు రోజుల ముందుగానే అందజేయాలని డిఆర్‌ఓకు సూచించారు. ప్రతి శాఖ నుండి ఉత్తమ సేవలు అందించిన ఇద్దరు ఉద్యోగుల పేర్లను మాత్రమే ప్రశంస పత్రాలకు సిఫారసు చేయాలని స్పష్టం చేశారు.

# రెవెన్యూ క్లినిక్స్‌తో ప్రజలకు వేగవంతమైన పరిష్కారం

**– నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**

మనగళం, నంద్యాల : జిల్లాలో రెవెన్యూ సంబంధిత సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో కలెక్టరేట్ ఆవరణంలో రెవెన్యూ యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏడు రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజల నుంచి మొత్తం 255 దరఖాస్తులు స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం నిర్వహించిన ఈ రెవెన్యూ క్లినిక్స్‌కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్, రెవెన్యూ డివిజనల్ అధికారులు తదితరులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత రెవెన్యూ డెస్క్‌లలో నమోదు చేసి, నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలకు నేరుగా సేవలు అందిస్తూ రెవెన్యూ శాఖపై నమ్మకాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా సమస్యల పరిష్కారం పారదర్శకంగా, సమర్థవంతంగా జరుగుతోందని అన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ, గ్రామ, వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి–9, అడంగల్ సవరణలకు సంబంధించినవి–64, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22–ఎ



భూములకు సంబంధించినవి - 48, అసైన్డ్ భూములు, భూఆక్రమణలకు సంబంధించినవి–25, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్‌కు సంబంధించినవి–30, సర్వే, రీ–సర్వేకు సంబంధించినవి–52, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి–27 దరఖాస్తులు ఉన్నాయన్నారు. స్వీకరించిన అన్ని సమస్యలను ప్రత్యేక శ్రద్ధతో త్వరితగతిన పరిష్కరిస్తామని, భవిష్యత్తులో కూడా ఇలాంటి రెవెన్యూ క్లినిక్స్‌ను కొనసాగించి ప్రజలకు సత్వర న్యాయం అందిస్తామని కలెక్టర్ తెలిపారు.


# స్వచ్ఛ సంక్రాంతితో పల్లెల ముఖచిత్రం మారాలి

**– 489 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు**
**– నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**




మనగళం, నంద్యాల : గ్రామాల రూపురేఖలను సుందరంగా తీర్చిదిద్దుతూ పరిశుభ్రతను మెరుగుపర్చే లక్ష్యంతో స్వచ్ఛ సంక్రాంతి – స్వచ్ఛ గ్రామ పంచాయతీలు కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం స్వచ్ఛ సంక్రాంతి స్వచ్ఛ గ్రామ పంచాయతీ కార్యక్రమంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో గత నెల 26 నుండి ఈ నెల 10వ తేదీ వరకు స్వచ్ఛ సంక్రాంతి – స్వచ్ఛ గ్రామ పంచాయతీలు కార్యక్రమం కింద 489 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో మురికి కాలువలను శుభ్రం చేయడం, పేరుకుపోయిన చెత్త నిల్వలు, చెత్త దిబ్బలను తొలగించడం జరుగుతోందన్నారు. అలాగే చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల్లో తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసి వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీ కొనసాగుతోందన్నారు. గ్రామస్థులు కూడ భాగస్వామ్యమై పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకొని గ్రామాల రూపురేఖల మార్పుకు సహకారం అందించాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. ఇప్పటివరకు 480 గ్రామ పంచాయతీల్లోని 1,709 చెత్త దిబ్బలను శుభ్రం చేసి, 391 టన్నుల చెత్త నిల్వలను తొలగించామని తెలిపారు. అదేవిధంగా 599 పాడుబడ్డ దిబ్బలను తొలగించడంతో పాటు, 280 చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను సమర్థవంతంగా పనిచేసేలా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే 531 నాడేపు తొట్టెలలో తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసి నింపడం జరిగిందని, 250 వర్మీ కంపోస్ట్ కిట్లను నింపడం ద్వారా సుమారు 7,781 కిలోల వర్మీ కంపోస్ట్ ఉత్పత్తి జరిగినట్లు కలెక్టర్ తెలిపారు.

# జస్ట్ రూ. 2 లక్షలతో రూ.75 లక్షలు..



ముంబై జనవరి 5 మనగళం,: చాలామంది షేర్ మార్కెట్ పేరు వినగానే నష్టమే గుర్తుకు తెచ్చుకుంటారు. డబ్బు పెట్టగానే మాయమైపోతుందన్న భయం ఎక్కువమందిలో ఉంటుంది. నిజానికి మార్కెట్‌లో నష్టపోయే వారిలో ఎక్కువమంది తొందరపాటు నిర్ణయాలు తీసుకునే వారు, ఓపిక లేకుండా వ్యవహరించే వారే. సహనం, అవగాహన, దీర్ఘకాల దృష్టితో పెట్టుబడి పెట్టిన వారికి మాత్రం ఇదే మార్కెట్ సంపదను సృష్టించే సాధనంగా మారుతుంది. ఇందుకు నిదర్శనమే ఒక సాధారణ వ్యక్తి తన దగ్గర ఉన్న కేవలం రూ. 2.75 లక్షల పెట్టుబడిని కాలక్రమంలో రూ. 75 లక్షల స్థాయికి తీసుకెళ్లే అవకాశం ఉన్న ప్రయాణం.స్టాక్ మార్కెట్‌ను చాలామంది తక్షణ లాభాల కోసం ఉపయోగించాలనుకుంటారు. కానీ అది జూదం కాదు, ఒక వ్యాపారం. వ్యాపారం అంటేనే ఓపిక, పరిశీలన, కాలానికి విలువ ఇవ్వడం. మార్కెట్‌లోకి కొత్తగా వచ్చే వారు రోజూ ధరలు పైకి దిగివచ్చే తీరును చూసి భయపడుతూ అమ్మకాలు చేయడం వల్ల నష్టాల్లోకి వెళ్తున్నారు. భావోద్వేగాలకు లోనవడం, ఇతరుల మాటలు నమ్మడం, ఒక్కసారిగా సంపాదించాలనే ఆలోచనలే ప్రధాన కారణాలు. అందుకే అనుభవజ్ఞులు ఎప్పుడూ దీర్ఘకాలిక పెట్టుబడినే సరైన మార్గంగా సూచిస్తుంటారు.ఒక ఉదాహరణగా చెప్పాలంటే 2017 నుంచి 2019 మధ్య కాలంలో ఒక వ్యక్తి తన కుమార్తె భవిష్యత్తు కోసం రూ. 2.75 లక్షలను కొద్ది మంచి కంపెనీల్లో పెట్టుబడిగా పెట్టాడు. ఆ కంపెనీలు అప్పట్లో పెద్దగా గుర్తింపు లేకపోయినా, వ్యాపార పరంగా బలమైన పునాదులు కలిగి ఉన్నాయి. కాలక్రమంలో ఆ సంస్థలు విస్తరణ సాధించాయి, లాభాలు పెంచుకున్నాయి, మార్కెట్‌లో విలువను సంపాదించుకున్నాయి. అయితే కరోనా సమయంలో మార్కెట్ ఒక్కసారిగా పడిపోవడంతో భయపడి ఆ వ్యక్తి తన పెట్టుబడులను విక్రయించాడు. అప్పటికి కొంత లాభం వచ్చినప్పటికీ, దీర్ఘకాలంగా ఉంచి ఉంటే ఆ మొత్తం రూ. 75 లక్షల స్థాయికి చేరుకునే అవకాశం ఉండేది.ఇందులో అసలు పాఠం ఏంటంటే మంచి కంపెనీలను గుర్తించి, వాటి మీద నమ్మకంతో కాలం ఇవ్వడం. అప్పట్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్ లాంటి సంస్థలు కూడా ఒకప్పుడు తక్కువ ధరలకే లభించాయి. కానీ సంవత్సరాల పాటు పెట్టుబడి కొనసాగించినవారు కోట్ల విలువైన సంపదను సృష్టించుకున్నారు. డివిడెండ్లు,

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# శ్రీశైలం ఈవో శ్రీనివాసరావు శివసేవకులతో సమావేశం



మనగళం శ్రీశైలం : దేవస్థానములో స్వచ్ఛంద సేవను అందిస్తున్న శివసేవకుల బృందాల నిర్వాహకులతో రోజు ( 05.01.2026) కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో స్వచ్ఛందసేవకు సంబంధించి పలు సూచనలను చేశారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శివసేవకుల స్వచ్ఛందసేవను దేవస్థానం మరింత విస్తృతంగా వినియోగించుకోవడం జరుగుతుందన్నారు. స్వచ్ఛందసేవకు ఆసక్తిగల వారు ఆన్‌లైన్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చునన్నారు. ఈ ఆన్‌లైన్ విధానంలో బృందాలుగా లేదా వ్యక్తిగతంగా కూడా స్వచ్ఛందసేవకు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. శివసేవకులు సేవను నిర్వహించు సమయంలో దేవస్థానమే తాత్కాలిక గుర్తింపుకార్డులను అందజేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా సేవాసమయంలో శివసేవకులకు గుర్తింపు కోసమై దేవస్థానం అధికార చిహ్నం (లోగో) తో స్కార్ఫ్‌ను అందజేస్తుందన్నారు. శివసేవకులలో తగు అవగాహన పొందేందుకుగాను దేవస్థానం కరదీపికను ( పాకెట్ సైజు పుస్తకాన్ని) కూడా అందజేస్తుందన్నారు. అదేవిధంగా సమయానుకూలంగా శివసేవకులకు దేవస్థానం అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తుందన్నారు. ఇంకా వారుమాట్లాడుతూ శివసేవకులు క్యూకాంప్లెక్సు, క్యూలైన్ల నిర్వహణ, ఆలయ ప్రాంగణం, అన్నప్రసాదవితరణ, కల్యాణకట్ట మొదలైనచోట్ల స్వచ్ఛందసేవను అందించాలన్నారు. స్వచ్ఛందసేవకులందరు కూడా అంకితభావంతో భక్తులకు సేవలు అందించాలన్నారు. ముఖ్యంగా యాత్రికులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. ప్రతి యాత్రికుడిని కూడా దేవస్థానానికి వచ్చిన అతిథిగా భావించాలన్నారు. అదేవిధంగా శివసేవకులు వారికి కేటాయించిన ప్రదేశాలలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా సేవలను అందజేయాలన్నారు. శివసేవకులందరు కూడా సమయపాలన పాటించడం ఎంతైనా అవసరమన్నారు. సేవా సమయంలో భక్తులు అడిగే సమాచారాన్ని కూడా సేవకులు ఓపికతో తెలియజేయాలన్నారు. ఈ సాధారణ సమాచారాన్ని దేవస్థానమే శివసేవకులకు సమకూరుస్తుందన్నారు. దేవస్థాన అధికారులు, సిబ్బంది అందరు కూడా శివసేవకులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తారన్నారు. దేవస్థానం అధికారులతో తగు సమన్వయం చేసుకుంటూ స్వచ్ఛందసేవకులు స్వచ్ఛందసేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో శివసేవకుల విభాగపు సహాయ కార్యనిర్వహణాధికారి కె. వెంకటేశ్వరరావు, పర్యవేక్షకురాలు టి. హిమబిందు తదితర సిబ్బంది, స్వచ్ఛందసేవా సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.




# శ్రీ స్వామి అమ్మ వార్లకు పల్లకీ ఉత్సవం



మనగళం శ్రీశైలం : లోకకల్యాణంకోసం దేవస్థానం ఈ రోజు ( 04.01.2026) రాత్రి శ్రీ స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహిస్తుంది. ఈ పల్లకీ ఉత్సవం ప్రతి ఆదివారం, పౌర్ణమి మరియు మూలా నక్షత్రం రోజులలో దేవస్థాన సేవగా (సర్కారి సేవగా) జరిపించబడుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవాసంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపించబడ్డాయి.

# స్థానిక సత్రాలు మరియు ఇతర సంస్థల నిర్వాహకులకు సూచన

మనగళం శ్రీశైలం దేవస్థానం పరిధిలోని కొన్ని ప్రైవేటు సత్రాలలో వ్యక్తిగత కార్యక్రమాలు అనగా పుట్టినరోజు వేడుకలు, ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు, విందులు, వినోదాలు మొదలైన కార్యక్రమాలు జరుగుతున్నట్లుగా దేవస్థానం దృష్టికి వచ్చినది.అనాదిక్షేత్రమైన శ్రీశైలం గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధమైంది. ఈ క్షేత్రంలో భక్తి, ఆధ్యాత్మిక సంబంధితమైన కార్యక్రమాలను మాత్రమే నిర్వహించవలసివున్నది.ఈ కారణంగా సత్రాలలో కూడా ఆధ్యాత్మిక ప్రవచనాలు, పారాయణలు, భజనలు, సత్సంగాలు మొదలైన కార్యక్రమాలను ఏర్పాటు చేసుకొనవచ్చు. అదేవిధంగా వైదికపరమైన కార్యక్రమాలు జరిపించు కొనవచ్చును. ఇందుకు భిన్నమైన కార్యక్రమాలు నిర్వహించడం వలన భక్తుల మనోభావాలకు విఘాతం కలిగే అవకాశం ఎంతైనా వున్నది.సత్రాలు వారు భక్తులలో మరింతగా భక్తిభావాలను పెంపొందింపజేసేందుకు, వారిలో ఆధ్యాత్మిక చింతనను కలిగించేందుకు కృషి చేయవలసిన అవసరం ఎంతైనా వున్నది.దేవదాయచట్టం 30/1987 అనుసరించి దేవస్థానం పరిధిలో క్షేత్రపరిధికి భంగం కలిగించే ఏ విధమైన కార్యక్రమాలు చేపట్టుట పూర్తిగా నిషిద్ధం.కావున అన్ని సత్రాల వారు మరియు ఇతర సంస్థల వారు కూడా వారి వారి సత్రాల నందు ఇటువంటి నిషేధిత కార్యక్రమాలు నిర్వహించుటకు అనుమతించకూడదని తెలియజేయడమైనది.ఇందుకు భిన్నంగా ప్రవర్తించిన వారిపై చట్టప్రకారం తగు చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించడమైనది.





# లోకకల్యాణార్థం పంచమఠాలలో పూజాదికాలు

మనగళం శ్రీశైలం లోక కల్యాణార్థం పంచమఠాలలో ఈ రోజు (05.01.2026) ఉదయం విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించబడ్డాయి. ముందుగా ఘంటామఠంలో ఆ తరువాత వరుసగా భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో ఈ పూజాదికాలు జరిపించడం జరిగింది. కాగా ఈ రోజు జరిగిన విశేషపూజాదికాలలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణ సంకల్పాన్నిపఠించారు. ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలనీ, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలనీ, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు నిర్వహించబడ్డాయి. తరువాత అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించబడ్డాయి.కాగా శ్రీశైల సంస్కృతిలో చాలాకాలం పాటు మఠాలు ప్రధానపాత్ర పోషించాయి. ప్రస్తుత సాధారణశకం 7వ శతాబ్దం నుంచి నిర్మించబడ్డ ఈ మఠాలు, గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం లాంటి నిర్మాణాలను కలిగివుండి, చూడటానికి ఆలయాల మాదిరిగానే కనిపిస్తాయి.
కొన్ని శతాబ్దాల నుండి కూడా ఈ మఠాలన్నీ క్షేత్ర ప్రశాంతతలోనూ, ఆలయ నిర్వహణలోనూ, ఆధ్యాత్మికపరంగా, భక్తులకు సదుపాయాలను కల్పించడంలోనూ ప్రధాన భూమికను వహించాయి. శ్రీశైలంలో కొన్ని మఠాలు కాలగర్భములో కలిసిపోగా, ప్రస్తుతం ఆలయానికి దగ్గరలో వాయువ్య భాగాన ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం అనే మఠాలు పంచమఠాలనే పేర్లతో పిలువబడుతున్నాయి. కాగా శిథిలావస్థలో ఉన్న ఈ మఠాలలో ఘంటామఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠాలను దేవస్థానం పూర్తిగా పునరుద్ధరించింది. ప్రాచీన నిర్మాణశైలికి ఎలాంటి విఘాతం కలుగకుండా ఈ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయబడ్డాయి. అదేవిధంగా భీమశంకర మఠానికి తగు మరమ్మతులు కూడా చేయబడ్డాయి. ఈ మఠాలలోని దేవతామూర్తులకు నిత్యధూపదీప నివేదన కైంకర్యాలు జరిపించడం జరుగుతుంది.



# విద్యుత్ ట్రూ ఆప్ చార్జీలు తగ్గించడంపై ప్రజల హర్షం

మనగళం, కర్నూలు సిటీ : గత వైసీపీ ఐదేళ్ళ పాలనలో ప్రజలు అనేక కష్టాలు ఎదురుకున్నారని, కూటమి ప్రభుత్వం అధికాంలోకి వచ్చాక సుపరిపాలన అందిస్తుందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. సీ.ఎం చంద్రబాబు విద్యుత్ ట్రూ ఆప్ చార్జీలు తగ్గించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. జగన్ హయాంలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి రాష్ట్ర ప్రజల పై దాదాపు రూ.32 వేల కోట్లు భారం మోపారని మండిపడ్డారు. జగన్ విద్యుత్ ను ఆదాయ వనరుగా మార్చుకుని రూ. 1.29 లక్షల కోట్లు అప్పులు మిగిల్చారని ఆరోపించారు. ఇక ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్ర బాబు, ఇచ్చిన హామీ మేరకు కరెంట్ చార్జీలు పెంచకపోవడమే కాక, వేల కోట్ల ట్రూ ఆప్ భారాన్ని కూడా ప్రభుత్వమే పూర్తిగా భరించబోతుందన్నారు. ఇక ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తూ ప్రజల మన్ననాలను పొందుతుందని ఎంపీ తెలిపారు.

# తప్పుగా డబ్బు పంపారా?




హైదరాబాద్ 05-01-2026 మనగళం : ఏకీకృత చెల్లింపు వ్యవస్థ ద్వారా డబ్బు పంపడం వేగంగా, సులభంగా ఉంటుంది. అయితే పొరపాటున తప్పు ఖాతాకు లేదా తప్పు గుర్తింపుకు డబ్బు వెళ్లిపోయినా భయపడాల్సిన అవసరం లేదు. ముందుగా మీరు ఉపయోగించిన చెల్లింపు యాప్‌లో లావాదేవీ వివరాలను పరిశీలించాలి. లావాదేవీ విజయవంతమై ఉంటే అందులో కనిపించే లావాదేవీ సూచిక సంఖ్యను తప్పనిసరిగా నోట్ చేసుకోవాలి. ఇది భవిష్యత్తులో ఫిర్యాదుకు కీలకం అవుతుంది.తదుపరి దశలో అదే యాప్‌లో ఉన్న ఫిర్యాదు ఎంపిక ద్వారా సమస్యను నమోదు చేయాలి. ఫిర్యాదు చేసిన వెంటనే మీ బ్యాంకును సంప్రదించి విషయం తెలియజేయడం మంచిది. అవసరమైతే డబ్బు వెళ్లిన వ్యక్తిని నేరుగా సంప్రదించి వినయంగా తిరిగి పంపమని కోరవచ్చు. చాలా సందర్భాల్లో ఇదే మార్గం వేగంగా ఫలితం ఇస్తుంది.బ్యాంకు నుంచి సరైన స్పందన రాకపోతే జాతీయ చెల్లింపుల సంస్థ వద్ద అధికారికంగా ఫిర్యాదు చేయవచ్చు. అక్కడ కూడా పరిష్కారం దొరకని పరిస్థితిలో భారతీయ రిజర్వ్ బ్యాంకు బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్ సేవలను వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియలన్నింటిలో ముఖ్యమైన విషయం వేగం. ఎంత త్వరగా చర్యలు తీసుకుంటే డబ్బు తిరిగి పొందే అవకాశం అంత ఎక్కువగా ఉంటుంది.ఇలాంటి పొరపాట్లు మళ్లీ జరగకుండా ఉండాలంటే ప్రతి చెల్లింపుకు ముందు ఖాతాదారుడి పేరు, గుర్తింపు వివరాలు, మొత్తం మొత్తాన్ని రెండుసార్లు తనిఖీ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. చిన్న జాగ్రత్త పెద్ద నష్టాన్ని తప్పిస్తుందని గుర్తుంచుకోవాలి.


## పీఎఫ్ ఖాతాదారులకు అదిరిపోయే సంక్రాంతి గిఫ్ట్..

న్యూఢిల్లీ జనవరి 5 మనగళం : : దేశవ్యాప్తంగా ఉన్న పీఎఫ్ ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం సంక్రాంతి కానుక ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఉద్యోగుల పదవీ విరమణ తర్వాత అందే కనీస నెలవారీ పెన్షన్‌ను భారీగా పెంచే దిశగా కేంద్రం కీలక అడుగులు వేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ కింద నెలకు రూ.1000గా ఉన్న కనీస పెన్షన్‌ను ఏకంగా రూ.5000కు పెంచే ప్రతిపాదనపై చర్చలు సాగుతున్నాయని తెలుస్తోంది. దీనిపై త్వరలోనే ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని వర్గాలు చెబుతున్నాయి.ప్రైవేట్ రంగ ఉద్యోగుల సామాజిక భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుంటున్నట్లు సమాచారం. ఎన్నో సంవత్సరాలుగా కనీస పెన్షన్ మొత్తం రూ.1000గానే కొనసాగుతోంది. ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగినా పెన్షన్‌లో మాత్రం ఎలాంటి మార్పు లేకపోవడంతో పెన్షనర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రూ.1000 పెన్షన్‌తో కనీస అవసరాలు కూడా తీర్చుకోవడం కష్టమవుతోందని పెన్షనర్ల సంఘాలు కేంద్రం దృష్టికి తీసుకెళ్లాయి.ఈ నేపథ్యంలో జీవన వ్యయం పెరిగిన దృష్ట్యా కనీస పెన్షన్‌ను రూ.5000కు పెంచాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక



## బొమ్మన శ్రీధర్ కు ఘన సన్మానం



మనగళం, ప్రత్యేక ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ బెస్త అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా బొమ్మన శ్రీధర్ ప్రమాణ స్వీకారం ఘనంగా సాగింది. విజయవాడ గొల్లపూడి బీసీ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో బొమ్మన శ్రీధర్ ను ఘనంగా సన్మానించారు. కర్నూల్ సిటీ బెస్త తెలుగు గంగపుత్ర సంక్షేమ సంఘం నాయకులు బొమ్మన శ్రీధర్ కు శాలువాలు కప్పి గజమాలతో సత్కరించారు. కర్నూల్ నగరంలోని బెస్త కమ్యూనిటీ ప్రజల కోసం వివాహాది శుభకార్యాలు, పుట్టినరోజు వేడుకలు, సమావేశాల నిర్వహణకు ఉపయోగపడే విధంగా బెస్త కమ్యూనిటీ హాల్, బెస్త భవన్ నిర్మాణం అవసరం ఉందని నగర కమిటీ సభ్యులు బొమ్మన శ్రీధర్ వినతిపత్రం ద్వారా కోరారు. బెస్త కార్పొరేషన్ చైర్మన్ శ్రీ బొమ్మన శ్రీధర్ సానుకూలంగా స్పందించారు. అన్నివిధాలుగా సహకరిస్తానని హామీ ఇచ్చారని కర్నూలు నాయకులు తెలిపారు. అదేవిధంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితాను కర్నూల్ సిటీ బెస్త తెలుగు గంగపుత్ర సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూల్ నగరంలో బెస్త భవన్ కావాలని కోరుతూ నగర కమిటీ నాయకులు మంత్రికి వినతి పత్రం అందజేశారు. అనంతరం బీజేపీ సీనియర్ నాయకులు బెస్త చంద్రమౌళిని నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కర్నూల్ సిటీ నగర కమిటీ గౌరవ సలహాదారులు బెస్త ఈరన్న (బీజేపీ మండల అధ్యక్షులు), వర్కింగ్ ప్రెసిడెంట్ బెస్త జలగరి వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్ వేటపాలెం శ్రీనివాసులు, నగర ప్రధాన కార్యదర్శి తెలుగు నాగ రమణ, కోశాధికారి తెలుగు వెంకటేష్ బాబు, జాయింట్ సెక్రటరీ ఎల్లా కృష్ణ, బెస్త సురేష్, తెలుగు నాగరాజు, ఈసీ మెంబర్స్ శ్రీరామ్, విజయ్ శేఖర్, రాజమణి ఆంజనేయులు, నారాయణ, యువత విభాగం అధ్యక్షుడు గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలాన్ మస్క్ బంపర్ ఆఫర్..



కారాకాస్ 05-01-2026 మన గళం : సంక్షోభంలో కూరుకుపోయిన వెనిజులా ప్రజలకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్ ఊరట కలిగించే ప్రకటన చేశారు. దేశవ్యాప్తంగా ప్రజలందరికీ ఉచితంగా శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉంచుతున్నట్లు ఆయన ప్రకటించారు. వెనిజులాలో నెలకొన్న రాజకీయ, భద్రతా పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు సమాచార వ్యవస్థకు అంతరాయం కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమ వేదికలో స్పందిస్తూ, నిర్దిష్ట కాలం వరకు ఎలాంటి ఖర్చు లేకుండా ఇంటర్నెట్ సేవలు వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు.ఇటీవల వెనిజులాలో చోటుచేసుకున్న పరిణామాల కారణంగా కమ్యూనికేషన్ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని అంతర్జాతీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ మార్పులు, భద్రతా ఆంక్షలు, విద్యుత్ అంతరాయాలు వంటి సమస్యల వల్ల సాధారణ మొబైల్ నెట్‌వర్క్‌లు పనిచేయకపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా మారుమూల గ్రామాలు, పట్టణాలకు దూరంగా ఉన్న ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఈ సేవలు జీవనాధారంగా మారనున్నాయి.ఎలాన్ మస్క్ ప్రకటన ప్రకారం ఫిబ్రవరి 03 వరకు వెనిజులా ప్రజలు ఈ ఇంటర్నెట్ సేవలను పూర్తిగా ఉచితంగా వినియోగించుకోవచ్చు. సంక్షోభ సమయంలో ప్రజలు కుటుంబ సభ్యులు, వైద్య సేవలు, అత్యవసర సమాచారంతో అనుసంధానంగా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశంలో పరిస్థితులు సద్దుమణిగే వరకు ప్రజలకు కనెక్టివిటీ అందించడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఈ సేవలు ప్రారంభమయ్యాయని, క్రమంగా దేశవ్యాప్తంగా విస్తరించనున్నాయని సమాచారం.వెనిజులాలో ఇంటర్నెట్ పరిమితులు, సమాచార నియంత్రణలపై గతంలోనూ అంతర్జాతీయంగా విమర్శలు వచ్చాయి. ప్రస్తుతం ఈ ఉచిత సేవలతో ప్రజలు స్వేచ్ఛగా సమాచారాన్ని పొందే అవకాశం ఏర్పడుతుందని భావిస్తున్నారు. సోషల్ మీడియా, వీడియో కాల్స్, అత్యవసర సమాచారం, వార్తల కోసం ప్రజలు ఈ సేవలను విస్తృతంగా వినియోగించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఎలాన్ మస్క్ తీసుకున్న ఈ నిర్ణయం వెనిజులా ప్రజల్లో ఆశలు రేకెత్తించడంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా కూడా విస్తృత చర్చకు దారి తీసింది.

## సహకార సంఘంలో చేరిన వారిని వెంటనే రెగ్యులర్ చేయాలి జీవో నెంబర్ 36 అమలు చేయాలి



మన గళం కోడుమూరు: సహకార సంఘం ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కరించాలని కోరుతూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సంపూర్ణంగా మద్దతు ప్రకటిస్తున్నామని సిపిఐ మండల కార్యదర్శి బి రాజు మద్దతు ప్రకటించడం జరిగింది . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగాలకు చెల్లించే గ్రాడ్యుటి సీలింగ్ రెండు లక్షల మాత్రమే చెల్లిస్తున్నారు గ్యాడ్యూటీ చట్టాన్ని అమలుపర్చి చట్టప్రకారం గ్యాడేటి చెల్లింపు చేయాలి సహకార సంఘం ఉద్యోగంలో పనిచేసే వాళ్ళని ప్రభుత్వ ఉద్యోగులుగా అమలై రిటర్మెంట్ వయసు 62 సంవత్సరాలు పెంచాలి 2019లో సహకార సంఘంలో ఉద్యోగంలో చేరిన వారిని రెగ్యులర్ గుర్తించాలి జీఎాజ ఆధ్వర్యంలో దీక్షలో కూర్చున్న సహకార సంఘం వాళ్లకు సంపూర్ణంగా సిపిఐ పార్టీ సంపూర్ణంగా మద్దతు తెలియజేస్తున్నాం ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఏఐటీయూసీ ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు తదితరులు పాల్గొన్నారు


## వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలి

**– కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : పీహెచ్సీ ల్లో వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్, హౌసింగ్, వైద్య ఆరోగ్యం, రెవెన్యూ క్లినిక్ తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ కు సంబంధించి చాలా అంశాలలో ప్రజల నుండి మంచి ఫీడ్ బ్యాక్ వచ్చిందన్నారు. అయితే వైద్య ఆరోగ్యం,సర్వే, రెవెన్యూ అంశాల్లో ఇంకా కొంత పురోగతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం మెడికల్ ఆఫీసర్ లు పి హెచ్ సి లలో సరైన సమయానికి హాజరు కావాలన్నారు. డ్రగ్స్ అందుబాటులో ఉన్నాయో లేదో వెరిఫై చేసుకోవాలని, ఒకవేళ స్టాక్ లేకపోతే వెంటనే ఇండెంట్ పెట్టి తెప్పించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మెడికల్ ఆఫీసర్ లను ఆదేశించారు. ముఖ్యంగా వచ్చిన పేషెంట్ లతో బాగా మాట్లాడి వారి సమస్యను ఓపికతో విని పరిష్కరించాలన్నారు. అదే విధంగా పిహెచ్సి, సి హెచ్ సి స్థాయిలో ఇవ్వాల్సిన ట్రీట్మెంట్ కూడా జీజీహెచ్ కి రిఫర్ చేయకుండా, అక్కడే వైద్యసేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సచివాలయ సిబ్బంది ఖచ్చితంగా బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలని కలెక్టర్ జడ్పీ సీఈవో, ఎంపిడిఓ లను ఆదేశించారు. సచివాలయం సిబ్బంది, విఆర్ఓ ల హాజరులో పురోగతి తీసుకొని రావాలని కలెక్టర్ తహసిల్దార్, ఎంపిడిఓ లను ఆదేశించారు. సచివాలయ సిబ్బంది పాఠశాలలను తనిఖీ చేయడంలో కూడా పురోగతి తీసుకొని రావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈటిపిఎస్ పోర్టల్ లో ఆయా శాఖలకు సంబంధించిన డాక్యుమెంట్ లను అప్లోడ్ చేయడంలో పురోగతి చూపించాలన్నారు. కల్లూరు తహసీల్దార్ ఆన్లైన్ పోర్టల్ లో చాలా బాగా అప్లోడ్ చేశారని, మిగిలిన తహసీల్దార్లు అదే విధంగా చేయాలన్నారు. వారం రోజుల్లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ తహసిల్దార్, ఎంపిడిఓ లను ఆదేశించారు. సర్వే, ఆర్ఓఆర్ కు సంబంధించి దరఖాస్తు లో విఆర్వో సంతకం అవసరం లేదని, అలా ఎవరైనా వస్తే విఆర్ఓ సంతకం కోసం ప్రజలను వెనక్కు పంపవద్దని కలెక్టర్ డిజిటల్ అసిస్టెంట్ లను ఆదేశించారు. రీ సర్వే కు ముందు నోటీస్ లు ఇవ్వడం లేదని, సర్వే నిర్వహించడం లేదని, సర్వే పూర్తి అయిన తర్వాత సర్టిఫికెట్ ఇవ్వడం లేదని ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ వచ్చిందని, వాటిని సరిచేసుకోవాలని కలెక్టర్ రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశించారు. ఉల్లి పంట వేసి నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందచేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు ఇంకా నష్టపరిహారం అందకుండా, పెండింగ్‌లో ఉంటే వారందరికీ బుధవారం నాటికి నిధులు జమ అయ్యే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మండల ఉద్యాన శాఖ, మండల వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డి ఆర్ ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, డి ఎం హెచ్ ఓ డా.భాస్కర్ , ఉద్యాన శాఖ అధికారి రాజ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ కూలీలకు అన్యాయం జరిగే కొత్తబిల్లును రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలి



మన గళం కోడుమూరు: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం గూడూరు కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ కూలీలకు అన్యాయం చేసే విధంగా తెచ్చిన కొత్తబిల్లును రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించేలా శాసనసభలల్లో ఆమోదం చెయ్యాలని అందుకు శాసనసభ్యులు మద్దతుగా నిలవాలని వారికి వివరించి వినతిపత్రాలను అందజేయ్యాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రా సమితి ఇచ్చిన పిలుపు మేరకు నేడు గూడూరు మండలం పొన్నకల్లు గ్రామంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఎంఎల్ఏ బొగ్గుల దస్తగిరికి వినతిపత్రం అందజేశారు. సోమవారం పొన్నకల్లు గ్రామంలో మీ భూమి మీ కోసం కార్యక్రమంలో రాజముద్ర గల పట్టాదార్ పాసుపుస్తకాలను రైతులకు పంపిణీ చెయ్యడానికి ఎంఎల్ఏ దస్తగిరి హాజరయ్యారు. ఈ సందర్బంగా ఏపీ వ్యవసాయ కార్మికసంఘం నియోజకవర్గ కార్యదర్శి, శేషుకుమార్,అధ్యక్షులు మునిస్వామి,పట్టణ కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంపై తీవ్రమైన దాడి మొదలైందని, వ్యవసాయ కూలీలకు పట్టేదన్నం పెట్టె ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసి పేదలనోట్లో మట్టి కొట్టె విధంగా బిజేపీ ప్రభుత్వం కసరత్తు చేస్తోందని విమర్శించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి జి రాంజి అనే కొత్త బిల్లును తీసుకురావడం చాలా దారుణమన్నారు. కొత్త బిల్లును పార్లమెంట్, శాసనసభ లల్లో సభ్యులు వ్యతిరేకించి ఉపాధి కూలీలకు అండగా నిలవాలని వారు శాసనసభ్యులు దస్తగిరిని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం నేతలు తిమ్మప్ప, లక్ష్మన్న, గిరి,శంకరయ్య,ఘనమాల రాజు, ఊరుకుంద ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

## కోడుమూరు మాలవీధిలో సంస్కృతి యజ్ఞం విశ్వహిందు పరిషత్ ధర్మప్రసార విభాగ్ మరియు హైందవశక్తి



మన గళం కోడుమూరు; సోమవారం ఉదయం స్థానిక కోడుమూరు పట్టణంలోని శ్రీశ్రీశ్రీ శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి దేవాలయంలో విశ్వహిందు పరిషత్ ధర్మ ప్రసార విభాగ్ మరియు హైందవశక్తి ఆధ్వర్యంలో ఎంతో భక్తి శ్రద్దలతో భక్తాదులు స్థానిక ప్రజలు కుటుంబ సమేతంగా పిల్లాపాపలతో యజ్ఞంలో పాల్గొన్నారు. ఈ యజ్ఞం లోకకళ్యాణం కొరకు మరియు మన సంస్కృతి సంప్రదాయాలను ఇప్పుడు తరాలు మరచిపోకుండా హిందూ సంప్రదాయం గొప్పదనం తెలిసే విధంగా ఈ యజ్ఞం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, దంపతులు పాల్గొన్నారు యజ్ఞం అనంతరం యజ్ఞంలో పాల్గొన్న దంపతులకు కానుకగా శ్రీరాముల వారి చిత్రపటం మరియు చీర సారె మరియు పట్టుపంచే తువాలు కార్యనిర్వాహులు అందించారు కార్యక్రమానికి అల్పాహారం ప్రసాద దాత ఈ మద్దిలేటి శెట్టి నిర్వహించారు ఈ కార్యక్రమంలో దంపతులు మోహన్ మౌనిక లలితా రాజేశ్వరి సురేష్ లత శివ లచ్చమ్మ ఆచారి శకుంతల శ్రీలక్ష్మి సురేంద్ర వెంకటేశ్వరమ్మ చెన్నకేశవులు ఇమ్మన్యులు లింగన్న తదితరులు యజ్ఞంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని నిలకంటేశ్వర దేవాలయం అర్చకులు ఈశ్వరయ్య చేతులమీదుగా విహెచ్పి వరప్రసాద్ మరియు హైందవశక్తి సల్వాడి సురేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో విహెచ్పి జిల్లా ఉపాధ్యక్షులు కిరణ్ ఖండ కార్యదర్శి నటరాజ్ ఖండ సహా కార్యదర్శి బుగుడే శ్రీనివాసులు విహెచ్పి సత్సంగం ప్రముఖ్ వెంకట్రామయ్య ఆచారి పత్తికొండ ధర్మ ప్రచారకు వై కే రంగన్న కోడుమూరు ధర్మ ప్రచార వరప్రసాద్ మరియు జయప్రకాశ్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP. Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.